# నీడలు

పార్వతి పొన్నలూరి, Passaic, NJ

'ప్రకాశం! కాఫీ తీసుకో! ఢిల్లీయాత్ర బాగా జరిగిందా? ఆగ్రా కూడా వెళ్తానన్నావు. అన్నీ తీరిగ్గా చూశావా? చిన్నప్పుడు నావళ్ళో పడుకొని తాజ్ మహల్, కుతుబ్ మీనార్ అంటూ కథలు చెప్పించుకొనేవాడివి. ఆ వెన్నెల...తెల్ల గులాబీలా మెరిసే తాజ్ మహల్...' అంటున్న బామ్మను మధ్యలోనే ఆపి 'వెన్నెలా...గిన్నెలా... ఓ తాజ్! తెల్లని రాజహంస...అంటూ కవిత్వం చెప్తే పోలీసులు డిష్యుం..డిష్యుం అంటారే బామ్మా!' అంటూ గన్ చూపించినట్లు యాక్షన్ చేశాను. ' ఇదేం విడ్డూరంరా! వెన్నెట్లో తాజ్ మహల్ ని చూడాలి అని నువ్వేగా అన్నావు. మధ్యలో ఈ డిష్యుం, డిష్యుంలు ఏమిటి?'

'బామ్మా! ఆ రోజులు పోయాయి. మీతరం వాళ్ళకే ఆ అందాలు, ఆనందాలు. టెర్రరిష్టులు పెరిగిపోయారు. సెక్యూరిటీ కోసం తాజ్ మహల్ ని సాయంత్రం 7గంటలు కాకముందే మూసేస్తున్నారు' అన్నాను.

'ఊ! బాగానే వుంది. ఏం చేస్తాం. రోజులు మారడం లేదూ!' అంటూ దీర్ఘంతీసింది బామ్మ. వరండాలో ఈజీఛైర్ లో కూర్చుని పశ్చిమాన సూర్యుడ్ని చూస్తున్నాను. నా చిన్నప్పుడు చరిత్ర పాఠం చెప్పే మాష్టారు ఇలా అంటుండేవారు. చాలాకాలం క్రిందట ఇళ్ళకు అసలు తాళాలు వేసేవారుకారట. రాత్రి ఆరుబయట, ఆకాశం క్రింద, చల్లగాలిలో నక్షత్రాల అందం చూస్తూ హాయిగా నిద్రపోయేవారట. ఇప్పుడలా పడుకుంటే తెల్లవారేసరికి కటకటాలు లెక్కపెడుతూ కూర్చోవాల్సిందే. అందమైన వెన్నెల, స్వచ్ఛమైన గాలి అనుభవించడం ఈ రోజుల్లో చాలా ఖరీదైన విషయాలు.

చిన్నప్పుడు నాన్నగారు అప్పుడప్పుడు విమానాశ్రయానికి తీసుకెళ్ళేవారు. విమానాలు భూమిమీద దిగడం, ఆకాశంలోకి ఎగరడంచూస్తే ఎంత ఉల్లాసంగా వుండేదో! మరీమరీ ప్రశ్నలు అడిగి నాన్నగార్ని విసిగించేవాడ్ని. ఇప్పుడా వినోదం, విజ్ఞానం నా పిల్లలకు తాను అందించగలడా? ఎప్పుడు, ఎక్కడ బాంబులు పేలుతాయో ఆ భగవంతుడికే తెలియదు. ఎప్పుడయినా పని ఉంటే ఆదివారాలుకూడా ఆఫీసుకు వెళ్తాను. సెక్యూరిటీ గార్డుకు నేను తెలుసు. అతను నాకు తెలుసు. అయినా నాజేబులో తాళంచెవులు లేకపోతే ఇద్దరం ఒకరికొకరం అపరిచితులం. ఉదయం ఆఫీసుకని ఇంట్లో బయలుదేరితే సిటీ బస్సులో, బజార్లలో జేబులోని మనీపర్స్ పైననే ధ్యాసంతా ఉంచుకోవాలి. అలా కాకపోతే అంత పరధ్యానమయితే ఎలా?అంటూ మనపర్సు కొట్టేసినవాడే మనల్ని సముదాయిస్తాడు. పోనీ ప్రశాంతతకోసం గుడికి వెళ్తామా! చిత్తం చెప్పులమీద, చేతుల్లో నమస్కారం పోజు. ఇంకెక్కడి ప్రశాంతత, భక్తి?

ఎందుకీ ఇన్ సెక్యూరిటీ ఫీలింగ్! మనల్ని చూసి మనమే భయపడుతూ రోజుల్ని ఎలా సాఫీగా గడప గలుగుతున్నామో అర్థం కాదు.

భూమిపై ప్రతి అణువునీ స్వాధీనంచేసుకొన్న మనిషి చంద్రమండలాన్ని కూడా కొద్దికొద్దిగా సొంతం చేసుకొంటున్నాడు. అంతేకాక ఇతరగ్రహాలమీద దాడిచేయడానికి అనుక్షణం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కాని జన్మభూమిపై గజం మేర స్థలాన్నికూడ ప్రశాంతంగా ఉంచుకోలేకపోతున్నాడు. హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, అవిశ్వాస తీర్మానాలు – గాలిపీల్చుకోడం, నీరుత్రాగడం వంటివి సహజకృత్యాలైనాయి.

నా చిన్నప్పుడు మా బామ్మ ఒక కథ చెప్తుండేది. కలియుగం ప్రారంభమవుతుందనగా ఒక రాజుగారు ఒక తగాదాను పరిష్కరించవలసి వచ్చిందట. తగాదా ఏమిటంటే ఒక కాపు తన పొలాన్ని భూస్వామికి అమ్మాడు. భూస్వామి ఆ పొలాన్ని దున్నిస్తుండగా లంకెబిందెలు బైటపడ్డాయి. ఆ లంకెబిందెల్ని భూస్వామి కాపును తీసుకోమన్నాడు. పొలం మీకు అమ్మేశాను కాబట్టి ఆ లంకెబిందెలోని ధనంకూడా మీదే! అని మీకు సంబంధించినవేకాని నావికావు అన్నాడు. నువ్వు పొలం అమ్మావు కాని లంకె బిందెల్ని అమ్మలేదు. కాబట్టి ఆ ధనం నీదే! అని భూస్వామి వాదించాడు. ఇద్దరూ తగాదాను పరిష్కరించుకోలేక రాజుగారి దగ్గరికి వెళ్ళారు. రాజుగారు విషయం అంతావిని తగాదాను అప్పటికి వాయిదావేశారు. ఈసారి వాయిదా రోజు కాపు, భూస్వామి పూర్వం తమ వాదాలకు భిన్నంగా వాదించసాగారు. లంకె బిందెలోని ధనం నాదంటేనాదని పోట్లాడుకో సాగారు. రాజుగారికి విషయం అర్థమయింది. కలియుగం ప్రారంభం అయిందని తెలుసుకొన్నాడు. నేను అడవుల్లో తపస్సుచేసుకోవడానికి వెళ్తున్నాను. నా తర్వాత ఈ సింహాసనం అధిష్టించే రాజుగారు మీతగాదాను పరిష్కరిస్తారు. అని ఆ రాజుగారు అడవులకు వెళ్ళిపోయాడు (అట).

ఈ కథలో లంకె బిందెలలోని ధనం చివరకు ఎవరుతీసుకున్నారనే విషయం అలా ఉంచితే, మొదటిసారిగ కాపు, భూస్వామి వాదించుకొన్న వాదనలో చిత్తశుద్ధి తలచుకొంటే, ఇప్పటికి నాకు ఆశ్చర్యం కలుగుతుంటుంది.

తాగే నోరు, పీల్చేగాలి కలుషితంకావచ్చు. అభిమానాలు, ప్రేమలు, ఒకరిపై ఒకరికి ఉండవలసిన నమ్మకం కలుషితం కానక్కర్లేదే! నవ్వులో మల్లెలురాలితే అందం. నమ్మకం జారనక్కర్లేదే!

ఈ రోజుల్లో జంతువులకు, రాక్షసులకు, భూతప్రేత పిశాచాలకు భయపడని నేను, నాలాంటి వాడిని చూసి భయపడుతుంటాను.

ఏదైనా వస్తువు ఎక్కడైనా మర్చిపోతే, లేదా పోగొట్టుకొంటే ఆ వస్తువును యజమానికి తిరిగి అందజేయబడే రోజులువస్తే ఎంతబాగుంటుంది?

ఏ పరిస్థితుల్లోను, నాలాంటిమనిషి నాకు ఏవిధంగాను హానిచేయడు. అనే గ్యారంటీతో మనుషులుపుడితే ఎంత ఆనందం!

ఇంటికి ఎవరైనావస్తే ఎవరదీ! అని వెలుపలి వాళ్ళను (అడిగి) అదేవిధంగా వెనక్కు పంపకుండా తలుపు తెరచి లోపలికి ఆహ్వానించగలిగే ధైర్యం అందరికీ రావాలంటే ఈ పరిస్థితులు ఎంతగా మారాల్సిన అవసరం ఉందోకదా!

మనకు చీకటి అంటే భయం. ఒంటరితనం అంటే భయం. అపరిచితులు అంటే అంతకంటే భయం.

భయం, కోపం, స్వార్థం, అవకాశవాదం, అనుమానం ఈ లక్షణాలన్నీ జంతుప్రవృత్తులు. మన రూపంమారినా ఈ లక్షణాలు మారడానికి యింకా ఎన్నియుగాలు పడుతుందో! కాని ఈ భయం అనే సహజాతాన్ని (instinct) జంతువులు అనుభవించని విపరీతస్థితిలో మనం అనుభవిస్తున్నాం. ఎందుకంటే ఏ జంతువు తనలాంటి జంతువును చూచిభయపడదు. కాని, నాలాంటి వాడిని చూచి భయపడతాను.

ప్రకృతి సృష్టించని యిరుకుగోడలు, ఇనుపకంచెలు, మన చుట్టు మనం కట్టుకుంటున్నాం. కొన్నిసమయాల్లో మనల్ని మనమే నమ్మము. మననీడ చూసి మనమే భయపడుతుంటాం.

ధైర్యస్థుడు అంటే భయంలేనివాడు అనే డిక్షనరీ అర్థానికి జాగ్రత్త తెలియని అసమర్థుడు అని లౌకికనిర్వచనం వాడుతుంటాం.

నమ్మకాన్ని నిలువునా హత్యచేసి భయం పరిపాలించేరాజ్యంలో మనందరం పౌరులం. (నా ఆలోచనలకు తెర పడింది).

'ప్రకాశం! అలా కూర్చున్నావేం? చీకటి పడింది. వీధితలుపులు తీసేవున్నాయి. ఎవరైనా జొరపడగలరు. అంత పరధ్యానమయితే ఎలా!' అంటున్న బామ్మముఖాన్ని ఆ మసకచీకట్లో చూడలేక తలదించుకొన్నాను.

....ఈ ధోరణికంతం మనకనంతమా? లేక కలియుగాంతమేనా??...కి.ర.